ప్రజాశక్తి
మంగళవారం 11 ఏప్రిల్ 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం నింపేనా?

- రేపటి నుంచి కృష్ణాజిల్లాలో చంద్రబాబు పర్యటన
- 12న మచిలీపట్నంలో సభ
- 13న నిమ్మకూరులో, 14న గుడివాడలో బస

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణాజిల్లా పర్యటన విజయవంతం చేసేందుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో పలు నియోజకవర్గాల్లో పార్టీ నేతల మధ్య చోటుచేసుకున్న అంతర్గత విబేధాలు బహిర్గతం కాకుండా పార్టీ అధిష్టానం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. నేతల మధ్య నెలకొన్న విబేధాలను చంద్రబాబు పరిష్కరించి గత సార్వత్రిక, స్థానిక ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఘోర ఓటమి నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల్లో చోటుచేసుకున్న నైరాశ్యాన్ని తొలగించి ఉత్సాహం నింపుతారని ఆ పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి.

అంతర్గత విబేధాలు చక్కదిద్దుతూ...జనసమీకరణపై కసరత్తు

చంద్రబాబు పర్యటనలో టిడిపి స్థానిక నేతల మధ్య అంతర్గత విబేధాలు బహిర్గతం కాకుండా ఆ పార్టీ అధిష్టానం ముందస్తు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే గుడివాడ నియోజకవర్గంలో మాజీ ఎంఎల్ఎ రావి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు వెనిగండ్ల రాము మధ్య చోటుచేసుకున్న విబేధాలపై దృష్టి సారించారు. వెనిగండ్ల రాముతో చంద్రబాబు ప్రత్యేకంగా చర్చించారు. పెడనతోపాటు మచిలీపట్నం, గన్నవరం నియోజకవర్గాల్లో నియోజకవర్గ స్థాయి నేతలతో సైతం ముందుగానే చర్చించినట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున జనసమీకరణను చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎంఎల్ఎ బొండా ఉమా తదితర నేతలు ఇప్పటికే మచిలీపట్నం వెళ్లారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపి కొనకళ నారాయణ తదితరులతోపాటు చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్థానిక నాయకుల మధ్య ఉన్న చిన్న చిన్న విబేధాలను చక్కదిద్దుతున్నారు.

విభేదాలపై నేతలతో చర్చ

2019 సార్వత్రిక ఎన్నికలు మొదలు, ఆ తర్వాత జరిగిన జిల్లా పరిషత్, ఎంపిటిసి, గ్రామ పంచాయతీ, కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి ఘోరంగా ఓటమి పాలైంది. దీంతో పార్టీ కేడర్ నిరాశకుగురైంది. ఇటీవల కాలంలో వైసిపి పాలనపై వివిధ వర్గాల్లో పెరుగుతున్న వ్యతిరేకత...ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమకు కలిసివస్తుందని నేతలు ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు జిల్లా పర్యటన కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతుందని ఆశిస్తున్నారు.

పర్యటన ఇలా

ఈనెల 12, 13, 14 తేదీల్లో టిడిపి ఆధ్వర్యంలో కష్ణాజిల్లాలో జరుగుతున్న 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. 12న జిల్లా కేంద్రం మచిలీపట్నంలో రోడ్‌షోతోపాటు, బహిరంగ సభల్లో పాల్గొంటారు. అనంతరం రాత్రికి టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు (ఎన్‌టిఆర్) స్వగ్రామమైన పామర్రు మండలం నిమ్మకూరులో ఆయన బస చేస్తారు. 13న ఎన్‌టిఆర్ శత జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అదే రోజు గుడివాడలో రోడ్‌షో, బహిరంగ సభల్లో పాల్గొంటారు. రాత్రికి గుడివాడలో బస చేస్తారు. 14న గుడివాడలో జరిగే అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచి ఏలూరు జిల్లా నూజివీడు వెళతారు.

భానుడు భగభగ

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతల్లో మార్పులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్‌టిఆర్ జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. సూర్యుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సగటున 37 డిగ్రీల సెల్సియస్ నమోదువుతోంది. ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెల్సియస్‌కు కాగా, సోమవారం 40 డిగ్రీలకు చేరుకుంది. ఆది, సోమవారాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలు, 24 డిగ్రీలుగా నమోదయ్యాయి. దీంతో రహదారులు సెగలు కక్కుతున్నాయి. పగలు ఎండ తీవ్రత, రాత్రి సమయాల్లో ఉక్క పోతలు అధికంగా ఉండటంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే ఇక మేలో ఎలా ఉంటుందోనని ప్రజలు హడలిపోతున్నారు. వచ్చే (మిగతా 6లో)

జిజిహెచ్‌లో మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు, చిత్రంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎం.సుహాసిని, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సుమన్

కోవిడ్‌పై అప్రమత్తం

- కొత్త వైరస్ నివారణకు ముందస్తు చర్యలు
- ఏడుగురిలో లక్షణాలు
- జిజిహెచ్‌లో ప్రత్యేక విభాగం
- మాక్ డ్రిల్‌లో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు కోవిడ్ కేసుల నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. వైద్యాధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. కోవిడ్ కేసుల నమోదు నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆస్పతుల్లో సోమవారం కలెక్టర్ డిల్లీరావు, వైద్య అధికారులు, సిబ్బందితో కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోవిడ్ ఎక్స్ బి బి 1.16 వైరస్ వేరియంట్ కేసులు పెరుగుతున్నాయన్నారు. ఈ వేరియంట్ ప్రభావం జిల్లాలో అంతగా (మిగతా 6లో)

ఉపాధి, భూమి, ఇళ్ల సమస్యలపై

14 నుండి సైకిల్ యాత్రలు

- ఆ తర్వాత సచివాలయాలు, మండల ఆఫీసుల వద్ద నిరసనలు
- మే 19న కలెక్టరేట్ వద్ద బహిరంగ సభ
- వ్యకాసం కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు శీలం, మురాల వెల్లడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

ఉపాధి, భూమి, ఇళ్ల సాధనకు జరిగే పోరాటంలో ప్రజలు కలిసి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు శీలం ప్రకాశరావు, మురాల.రాజేష్ పిలుపు నిచ్చారు.సోమవారం మచిలీపట్నంలోని జ్యోతి రావు పూలే విజ్ఞాన కేంద్రంలో వారు మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ పేదల సమస్యల పరిష్కారం కోసం బడుగు జీవుల ప్రియతమ నేత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 నుండి 5 రోజులపాటు కృష్ణా జిల్లాలో మూడు సైకిల్ యాత్రలు జరుపనున్నామని తెలిపారు. ఈమూడు యాత్రా దళాలు 14న ఉదయం మచిలీపట్నంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బయలుదేరుతాయన్నారు. మొదటి యాత్ర బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు, గుడివాడ, నందివాడ, బాపులపాడు, ఉంగుటూరు మీదుగా గన్నవరం చేరుతుందన్నారు. అలాగే రెండో యాత్ర మొవ్వ, ఘంటశాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మీదుగా కోడూరు చేరుతుందని పేర్కొన్నారు. మూడో (మిగతా 6లో)

మీడియాతో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శీలం ప్రకాశరావు, మురాల రాజేష్

వార్త మెయిన్‌లో

హనుమాన్‌జంక్షన్‌లోని స్వగృహంలో కళ్యాణిని అరెస్టు చేస్తున్న పోలీసులు

గన్నవరం ఘటనలో టిడిపి తెలుగు మహిళా నాయకులు కళ్యాణి అరెస్టు



రంజాన్ వేళలు

వారం		వేళలు
మంగళవారం	ఇఫ్తార్	6.41
బుధవారం	సహరి	4.45

జిల్లావ్యాప్తంగా విద్యుత్ భారాలపై టిడిపి నిరసన

ప్రజాశక్తి-విజయవాడరూరల్: జగన్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి కాలనీలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం టిడిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టి రైతుల మెడలకు ఉరితాళ్లు బిగిస్తున్నారని, కేంద్ర ఇచ్చే డబ్బులకు సీఎం జగన్ కక్కుర్తిపడి మోటర్లకు మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్రా వాసు, మందా మురళీమోహన్, కారుమంచి దుర్గారావు, గూడపాటి పద్మశేఖర్, జాలిపర్తి గోపాలకృష్ణ, వడ్లమూడి చలపతిరావు, నూతలపాటి వెంకటేశ్వరావు (నారద) పాల్గొన్నారు. నిడమానూరులో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు దండు సుబ్రహ్మణ్యరాజు, గూడవల్లి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల:** కంచికచర్లలో స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కార్యాలయం ఇన్చార్జి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, మాజీ ఎంపిపి అల్లడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో దేవినేని ఉమా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు. **ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** రంగాపురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలు అనేక ఇబ్బందులు పాలయ్యారని, ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని టీడీపీ నాయకులు అన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** జగ్గయ్యపేట పట్టణం డిపో సెంటర్ వద్ద గల సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో కట్ట నరసింహారావు, గింజుపల్లి రమేష్, మైనేని రాధాకష్ణ, షేక్ సత్తార్, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, కంచేటి గీతారాణి, మల్లెల.వెంకట్, గొట్టే నాగరాజు, ఇరి నరసింహారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వీరులపాడు:** అల్లూరు సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు కె.శ్రీనివాసకుమార్, నాయకులు డి.మధుసూదనరావు, జి.అజయ్‌కుమార్, సిహెచ్.భారత్‌రెడ్డి కాపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నందిగామ విద్యుత్ ట్రాన్స్‌కో ఎడిఇ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నందిగామ పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము, టిడిపి నాయకులు ఏపూరి నాగేశ్వరరావు, మండవ శ్రీనివాసరావు, కె.లక్ష్మీనారాయణ, మనబోతుల శ్రీరామ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-భవానీపురం:** భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ యేదుపాటి రామయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు సోలంకి రాజు, గంగాధర్‌రెడ్డి, మరుపిళ్ల తిరుమలేష్, ధనేకుల సుబ్బారావు, బెవర సాయి సుధాకర్, దూది బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు బిగించవద్దని, విద్యుత్ కోతలు నివా రించాలని తిరువూరు మునకుళ్ల రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బొమ్మసాని ఉమామహేష్, నాయకులు తాళ్లూరి రామారావు, మరకాల కృష్ణకుమారి, సింధుశ్రీను, కందిమళ్ల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: రంజాన్ సందర్భంగా 500 మంది పేద ముస్లిం మహిళలకు గణపతిరావు రోడ్డులోని ఖిద్మత్ ఘర్ కార్యాలయం వద్ద చీరలు పంచే కార్యక్రమం ముహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముహమ్మద్ ఫతావుల్లా మాట్లాడుతూ ఖిద్మత్ ఘర్ (సేవా గహము) ద్వారా అనేక మంచి కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ఇక్కడి నుంచే రంజాన్ నెలలో ప్రతిరోజూ సహేరి భోజనం ఉచితంగా పంచబడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగుల్ మీరా, తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, కాంగ్రేగుల రవీంద్ర, అబ్దుల్ ఖలిఖ్, ఆన్సర్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంఘం ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆవిర్భావ దినోత్సవం మహాత్మాగాంధీ రోడ్డులోని రామమోహన గ్రంథాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. ముందుగా గ్రంథాలయ కమిటీ అధ్యక్షులుచింతలపూడి కోటేశ్వరరావు, అయ్యంకి వెంకటరమణమూర్తి విగ్రహాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం కార్యదర్శి వేములపల్లి కేశ్వరరావు గ్రంథాలయ సంఘం ఆవిర్భావం, ఆ సంఘం చేసిన సేవలు,దీనిలో రామమోహన్‌గ్రంథాలయ పాత్రను వివరించారు.

భవానీపురం సిఐగా అబ్దుల్ సలాం

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పోలీస్‌స్టేషన్ సీఐగా అబ్దుల్ సలాం నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భవానీపురం సీఐగా ఉన్న ఉమర్‌ను ఇటీవల వీఆర్‌కు పంపిన విషయం విధితమే. దీంతో ఆయన స్థానంలో ట్రాఫిక్-3 స్టేషన్ సీగా ఉన్న అబ్దుల్ సలాంను భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు సీఐగా నియమించారు. గతంలో అబ్దుల్ సలాం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే...

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పరిధిలోని 11 కె.వి. గాంధీ బొమ్మ ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా భవానీపురం బ్యాంకు సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్డు, గాంధీ బొమ్మ రోడ్, చర్చ్ రోడ్, కోళ్లఫారం రోడ్ , డాల్ఫిన్ బార్ రోడ్ మరియు ఆర్.టి.సి వర్క్ షాప్ రోడ్ తదితర ప్రాంతాలలో ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు (2 గంటలు) విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలోని శ్రీ చైతన్య స్కూల్‌లోని విద్యార్థినీ విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. పోక్సో యాక్ట్, డైయల్ 100, 112 , దిశ యాప్ వలన కలిగే ఉపయోగాలు తదితర అంశాలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, ఎల్.హెచ్.ఎమ్.యస్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం, మహిళా సంబంధిత నేరాల గురించి దిశా సబ్ ఇన్స్పెక్టర్ విజయకుమారి , వారి సిబ్బందితో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నేరావు పేటచ కుదప రావి చెట్టు సెంటర్ ఏరియాల లోని వివిధ ప్రదేశాలలో గల ఏరియా లో గల ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది చేరువ వాహనం ద్వారా పైన తెలిపిన వాటితో పాటు చిన్నపిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాలపై వివరించారు. నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, చిన్న చిన్న వీడియోల రూపంలో స్క్రీన్ పై ప్రదర్శించి అవగాహన కల్పించారు.

టెన్త్ మూల్యాంకన విధుల్లో మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎస్ఎస్‌సి-2023 పరీక్షల మూల్యాంకనం విధులు జిల్లాలోని సుదూర ప్రాంతాలైన కొన్ని మండలాల ఉపాధ్యాయులకు వయస్సు, ఆరోగ్య రీత్యా మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.సుందరయ్య జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుకకు వినతిపత్రం అందచేశారు. సోమవారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. అనంతరం సుందరయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దీర్ఘకాల వ్యాధులుతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, గర్భిణీలు, పిల్లల తల్లులకు కూడా మినహాయింపు ఇవ్వాలన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉపాధ్యాయులు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల వివరాలను సేకరించి మూల్యాంకణ విధులు వేయాలని కోరారు.

14వ డివిజన్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: 14వ డివిజన్‌లోని సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పటమట మీ సేవ కేంద్రంలో జరిగిన స్పందనలో జోనల్ కమీషనర్‌కు 14వ డివిజన్ సిపిఎం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశ్యూరు. తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు వి.గురుమూర్తి, నగర కమిటీ సభ్యులు మస్తాన్, ఈశ్వరరావు, తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 14వ డివిజన్‌లోని పుట్టరోడ్డులో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తచి నెలలు కావస్తున్నా నేటికీ ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుతం వేసవి వలన మంచినీటి సమస్య రాకుండా వాటర్ ట్యాంకును వెంటనే ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వాటర్ ట్యాంకు నిర్మాణం సందర్భంగా పుట్టరోడ్డు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిందని దీని వలన డ్రైనేజీ పొంగి రోడ్లమీదకు నీరు వస్తుందన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: దాతలు ముందుకు వస్తే ప్రజలకు మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పించగలుగుతామని పుట్టగుంట వెంకట సతీష్ హెల్త్ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. పుట్టగుంట వెంకట సతీష్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 2.50 లక్షల రూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన రక్షిత మంచి నీటి పథకం (ఆర్‌వో ప్లాంట్)ను సోమవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు దాతలు సహకారిస్తే ప్రజలకు మరిన్ని మౌలిక సదుపాలయాలను కల్పించగలుగుతామన్నారు. పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పి వెంకట సతీష్ మాట్లాడుతూ తన ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లాలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య, ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉచిత వైద్య శిభిరాలను నిర్వహించి పేద ప్రజలకు వైద్య సహాయం అందించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలో అభివృద్ధిలో భాగంగా తరగతి గదులల నిర్మాణం పేదల విద్యార్థులకు పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ఇంతియాజ్ పాషా, అసిస్టెంట్ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖతీఫ్ కౌసరా బానో, లైన్స్ క్లబ్ విజయవాడ పూర్వపు అధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు, లైన్స్ క్లబ్ ప్రతినిధులు శంకర్‌గుప్త్, సిహెచ్ శ్రీనివాసరెడ్డి, రామకృష్ణప్రసాద్, రామిశెట్టి కొండలరావు శారదవాణి, కె.రామకృష్ణప్రసాద్ బోమ్మదేవర వడయవర్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వన్‌టౌన్: న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్, సుధా టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్‌లోని తాటాకుల వారి వీధి జగన్మోహన్ కాంప్లెక్స్‌లో ఈనెల 12వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు "టాప్ స్టార్స్ హాస్పిటల్" గుండె నిపుణుడు డాక్టర్ తబిష్ సయ్యద్, ఎముకుల నిపుణుడు డాక్టర్ తుమాతి షణ్ముఖ, వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు.

నోటి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సెన్సోడైన్ ఆధ్వర్యంలో నోటి సంరక్షణపై అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధి కె.ఎస్.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా వినియోగదారులకు నోటి సంరక్షణ విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై వివిధ ప్రాంతాలలో సదస్సులు, సెమినార్లను నిర్వహించినట్లు తెలిపారు. సెన్సిటివ్ ఓరల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా దంత వైద్యునిచే అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 70 ప్రాంతాలలో సుమారు ఐదువేల మందికి దంత పరిశుభ్రత, నోటి సంరక్షణ అంశాలపై సదస్సుల ద్వారా వివరించినట్లు తెలిపారు.

హిమాలయ రోజ్ ఫేస్‌వాష్ విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అగ్రశ్రేణి వెల్‌నెస్ బ్రాండ్ హిమాలయా సంస్థ తాజా ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ఇన్‌ఛార్జి ఆర్.ఎస్. ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. హిమాలయ నేచురల్ గ్లో రోజ్ ఫేస్ వాష్, తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిని విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో విమెన్ ప్రీమియర్ లీగ్‌లో క్యాంపెయిన్ నిర్వహించినట్లు తెలిపారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని పలుచోట్ల టిడిపి ధర్నా

ప్రజాశక్తిలి-ఉయ్యూరు : రాష్ట్రంలో రూ.57 వేల కోట్ల విద్యుత్ చార్జీల బాదుడుకు నిరసనగా టీడీపీ పిలుపుమేర ఉయ్యూ రు పట్టణ, మండల పార్టీ అధ్వర్యంలో సోమవారం ఉయ్యూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఎ దుట పార్టీ నాయకులు ధర్నాచేసి నిరసన తెలిపారు. ప్రజలకు పెనుభారంగా పరిణమి ంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, పట్టణపార్టీ అధ్యక్షుడు గుర్నాధరావు, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలు అరికట్టలేని వైసీపీ ప్రభుత్వం విద్యుత్, బస్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. పెంచిన చార్జీలు వెంటనే తగ్గించకపోతే ప్రజల మద్దతుతో ఉద్యమం ఉదతం చేస్థామని హెచ్చరించారు. **ప్రజాశక్తి-గుడివాడ** : ఇప్పటికే ఏడుసార్లు విద్యుత్ చార్జిల పెంచిన ప్రభుత్వం ఏప్రియల్ నెల నుండి ప్రజలపై విద్యుత్ బాకాయిల పేరిటి 57 వేల కోట్లు ప్రజలపై బారం వేసిందని వెంటనే పెంచిన విద్యుత్ చార్జిలను తగ్గించాలని మాజీ ఎమ్మేల్యే రావి వెంకటేశ్వరావు అన్నారు. సోమవారం స్థానిక ఏలూరురోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయాంలో ఉన్నప్పుడు ఒక రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. విద్యుత్ భారం రైతులపై, ఆక్వా రంగంపై పడటమే కాకుండా పేద ప్రజల నడ్డి విరిచే విధంగా ఉందన్నారు. టిడిపి పట్టణ,రూరల్ మండలల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు. శొంటి రామకష్ణ, అడుసుమిల్లి శీను, టిడిపి నియోజకవర్గ పట్టణా తెలుగుయువత అధ్యక్షులు గోవాడ శివా, నేరుసు కాశి, పోలాసి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి** : మండలంలోని వెంట్రప్రగడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, నాయకులు కలపాల కిషోర్, మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి, గొరిపర్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ సెంటర్లో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బందరు మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీలో సభ్యులు కొల్లు రవీంద్ర, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో అవనిగడ్డ పార్టీ కార్యాలయం నుండి రాజీవ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నేడు ఆర్థిక క్రమశిక్షణ లేని జగన్ రెడ్డి పాలన వలన రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను పెంచి రైతుల మీద పెనుబారం నొప్పి రైతులను కోల్కోలేని విధంగా ఇబ్బందులు పెడుతున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధ రావు(బుల్లయ్య), పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్ రామ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు)** : ఉంగుటూరు మండలంలోని తెలప్రోలు గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఆరుమళ్ల కష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్లమెంటరీ రైతు నాయకుడు దుడ్ల కుమార్, గ్రామపార్టీ ఉపాధ్యక్షులు గుడ్డేటి శ్యాం, సీనియర్ నాయకులు మోహనరెడ్డి, అప్పారావు, మహేష్ నిమ్మకూరి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో...

గుడివాడలో...

అవనిగడ్డలో...

ఉంగుటూరులో..

3.5 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి.-గన్నవరం : రహస్యంగా గంజాయి తరలిస్తున్న ఇరువురు పాత నేరస్తులపై దాడులు చేసి వారి వద్ద నుండి 3.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు గన్నవరం సీఐ పి. కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గన్నవరం మండలం కేసరపల్లి కి చెందిన కొండేటి అనిల్, ఉంగుటూరు మండలం తేలప్రోలు కు చెందిన శెనగల శివ నాగ రెడ్డిలు రహస్యంగా గంజాయి విక్రయాలు చేస్తూ జల్సాగా జీవితాన్ని గడుపుతున్నారు.వారు గంజాయి కలిగి ఉన్నారని వచ్చిన సమాచారం మేరకు గన్నవరం సిఐ పి.కనకారావు, ఎస్.ఐ లు శ్రీనివాస్, రమేష్‌లు కేసరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద కొండేటి అనిల్ ను చాకచక్యంగా పట్టుకొని శోదా చేయిగా అతని వద్ద 500 గ్రాములు గంజాయి లభించింది. అలాగే ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన శెనగల శివ నాగరెడిని గన్నవరం కోనయ్య చెరువు వద్ద మాటు వేసి పట్టుకొని సోదా చేసి అతని వద్ద నుండి 3 కేజీలల గంజాయిని సీజ్ చేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్దనుండి 3.50 కేజీలు గంజాయిని స్వాధీనపరచుకొని, కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - మొవ్వ : ఒకవైపు ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు మరొక వైపు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఇంకొకవైపు పోలీస్ అధికారుల పరిశీలనల మధ్య సోమవారం మొవ్వ మండలంలో పదవతరగతి లెక్కలపరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండలంలోని నిడుమోలు, కాజ, కోసూరు (ఓఎస్ఎస్‌సి), మొవ్వ-ఏ కేంద్రం, మొవ్వ-బి(ఒకేషనల్) కేంద్రం, పెడసనగల్లు, కూచిపూడి (ఓ ఎస్ ఎస్ సి) కేంద్రాలలో ఈ పరీక్షలు జరిగాయి. కాగా కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగే పరీక్షల నిర్వహణలను పామర్రు సీఐ ఎన్ వెంకట నారాయణ పరిశీలించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి కోడూరు : లెజెండ్స్ సోషల్ సర్వీస్ సంస్థ స్థాపించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గత కొద్దిరోజుల క్రితం కోడూరులో ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర శిబిరంలో ఆపరేషన్ అవసరమైన 80 మందిని గుర్తించి, వారిలో 40మందిని శనివారం, సోమవారం ప్రత్యేక మూడు వాహనాలలో మచిలీపట్నం తీసుకువెళ్లి ,ఆపరేషన్కు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, కంటి చుక్కల మందులు ఉచితంగా అందించి, వారికి భోజన వసతి కల్పించి, మరల వారిని సురక్షితంగా కోడూరుకు తీసుకువచ్చారు. వీరికి డాక్టర్లు చెప్పిన విధంగా చుక్కల మందు వాడిన అనంతరం కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు లెజెండ్స్ సోషల్ సర్వీస్ అధ్యక్షులు పూతబోయిన అయ్యప్ప స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీస్ సభ్యులు బండే కిషోర్, బడే నాని, బాదర్ల శ్రీనివాస్, దామెర్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మూడో డివిజన్‌లో రంగా విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకష్ణ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ వేసవిని పురస్కరించుకుని పట్టణ,మండల పరిధిలో జనసైనికుల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ,శీతలపానీయాలు, మంచినీరు పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, డివిజన్ ఇన్చార్జిలు పినిశెట్టి వేణు, ఉడుముల బుజ్జి,లక్ష్మణ పాల్గొన్నారు.

ఉపాధి నిమిత్తం బడ్డీకొట్టు అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రమాదంలో గాయపడి కుటుంబ పోషణ కష్టతరమైన వ్యక్తికి తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో సోమవారం బడ్డీకొట్టు అందజేశారు. చిన ఓగిరాలకు చెందిన హేమంత్ ఇటీవల ప్రమాదంలో తీవ్రగాయాలవ్వగా, చేతికందిన ్చన కుమారుడు దివ్యాంగుడు కాగా వారి కుటుంబ పోషణ కష్టతరంగా ఉన్న పరిస్థితు ల్లో ఉపాధి నిమిత్తం బడ్డీకొట్టు అందజేయడం పట్ల పలువురు అభినందించారు. పార్టీ నాయకులు కుటుంబరావు, రామకృష్ణ, ఏడుకొండలు తదితరులు చౌదరిని అభినందించారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

అవనిగడ్డలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

గుడివాడలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ : ఈనెల 12వ తేదీన మచిలీపట్నంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. సోమవారం అవనిగడ్డ టిడిపి కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో రవీంద్ర పాల్గొని చంద్రబాబు నాయుడు పర్యటన పై పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను అన్ని రంగాల వారికి జగన్ రెడ్డి మోసం చేశాడన్నారు. ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో మచిలీపట్నంలోని మూడు స్తంభాల సెంటర్ వద్దకు చంద్రబాబు చేరుకుంటారని అక్కడనుండి కోనేరు సెంటర్ మీదుగా హిందూ కాలేజీ మైదానంలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడతారన్నారు. మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, మాజీ ఉపసభాపతి మండలి వద్ద ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ** : ఈనెల 12,13,14 తేదీల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనలో దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా టిడిపి సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారయణ పిలుపు నిచ్చారు. సోమవారం మాజీ ఎమ్మేల్యే రావి వెంకటేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన సమావేశంలో దళిత నాయకలు వాసే మురళీ, కంచర్ల సుధాకార్, పులవర్తి డేవిడ్‌లతో కలసి టిడిపి రాష్ట్ర నాయకుడు కొడాలి రామరాజు, జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారా యణలు మాట్లాడారు. టిడిపి దళిత నాయకలు రజనీకాంత్, పిళ్ళా సాల్మన్, కనకబరం నీరుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మొవ్వ** : టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు కష్ణాజిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 12 నుండి14 వరకూ చంద్రబాబు కష్ణాజిల్లా పర్యటన నేపథ్యంలో కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండల కేంద్రమైన మొవ్వలో సోమవారం పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పామర్రు నియోజకవర్గ పరిధిలోని గురజాడ గ్రామం వద్ద పార్టీ అధినేతకు ఘనస్వాగతం పలకనున్నట్లు చెప్పారు. నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నుండి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యాలయంలో పార్టీ నేతలు రామలింగేశ్వర రావు ,తాతినేని చినపూర్ణ ,పద్మ ,పెదపూడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు .తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సోషల్ వర్కర్లకు ఆహ్వానం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో కొత్తగా మండల న్యాయసేవాధికార కమిటీ ఏర్పాటుకు ఆసక్తిగల సోషల్ వర్కర్స్ ను ఆహ్వానిస్తున్నట్టు మండల న్యాయసేవా ధికార కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె. శ్రీహరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసంస్థ ద్వారా న్యాయ సహాయం, సలహాలు అందించుట, న్యాయ సేవలకై అనుభవం కలిగిన సోషల్ వర్కర్స్ మండల న్యాయ సేవాధికార కమిటీని సంప్రదించాలని తెలిపారు. లీగల్ సర్వీసెస్ ను ప్రచారంచేయుట, లోక్ అదాలత్ సదుపాయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, రాజీ మార్గాల గొప్పతనాన్ని తెలియచేయవలసి ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు కమిటీని సంప్రదించాలని పేర్కొన్నారు.

హైవే రైతులకు పరిహారం అందేనా?

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ వద్ద విజయవాడ-హైదరాబాదు జాతీయ రహదారి నిర్మాణానికి రైతులు భూములిచ్చి నాలుగేళ్ల అవుతున్నా నష్టపరిహారం అందలేదు. ఆరు వరుసల రహదారి నిర్మాణం నిమిత్తం రైతులు నుండి భూములు తీసుకున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రెండేళ్ల అవుతున్నా పరిహారం అందజేయటంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతున్నా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందిగామ పట్టణంలో గత రెండు లైన్ల హైవే బైపాస్ రోడ్డు ఉంది. దీన్ని ఏడు కిలోమీటర్ల పొడవునా ఆరు వరుసలు నిర్మించారు. స్థానిక చందాపురం, రామన్నపేట, అనాసాగరం వద్ద హై సర్వీసు కోసం రైతుల నుండి భూములు సేకరించారు. రోడ్డు నిర్మాణం చేశారు. నందిగామ వై జంక్షన్ వద్ద 880 మీటర్లు మాత్రమే నిర్మించాల్సి ఉండి. మిగిలిన అన్ని చోట్ల భూసేకరణ పూర్తి చేసి రహదారి వేశారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం భూములు కూడా ఇందులో ఉన్నాయి. కొంత మందికి గతంలో రిజిస్ట్రేషన్ ధర ప్రకారం గజాల్లో, మరి కొందరికి ఎకరాల్లో నష్టపరిహారం లెక్కించారు. పరిహారం అంచనాలో భారీ తేడా రావడంతో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పది మంది కోర్టును ఆశ్రయించారు. మొత్తం 152 మందికి మాత్రమే నష్టపరిహారం అందుకున్నారు. ఇంకా 107 మందికిపరిహారం అందలేదు. తమ భూములకు సంబంధించి అన్ని రికార్డులు రెవెన్యూ అధికారులకు సమర్పించినా మళ్లీ ఇవ్వాలని పంపుతున్నారని రైతులు వాపోతున్నారు. పదిమందికి సంబంధించి అన్ని రికార్డులు స్వీకరించిన స్థానిక రెవెన్యూ అధికారులు పరిహారం మంజూరుకు ఉన్నతాధికారులకు దస్త్రాలు పంపి సైతం నెలలు గడుస్తుంది. అయినా ఫలితం లేకపోలేదు. కొందరు రైతులు భూములకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేవని అధికారులు పేర్కొంటున్నారు. అన్ని రికార్డులు ఇస్తే ఉన్నతాధికారులకు పంపిస్తామని అంటున్నారు. వెంటనే పరిహారం వచ్చేలా చూడాలని భూముల యజమానులు కోరుతున్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు మెరుగైన పోషక విలువలు గల పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్య పరిస్థితులలో సత్ఫలితాలు సాధించగలిగామని, 2025 నాటికి క్షయ వ్యాధిని సమూలంగా రూపుమాపేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి నిక్షయ మిత్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా క్షయ వ్యాధి నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని రెడ్‌క్రాస్ భవనంలో క్షయ వ్యాధి గ్రస్తులకు ఆరో విడత పౌష్టికాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికి 700 రూపాయల విలువ గల పౌష్టికాహారాన్ని ఆరు మాసాల పాటు అందించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.సమరం, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఉషారాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ యం సుహాసిని, క్షయ వ్యాధి నివారణ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.చిన్నికృష్ణ, రైడ్‌కాస్ర్ సోసైటీ మేనేజర్ సిహెచ్.శ్రీనివాస్‌రావు, డిజాస్టర్ కో-ఆర్డినేటర్ పి.రాధిక, అసిస్టెంట్ మేనేజర్ టి. సునీత తదితరులు పాల్గొన్నారు.

42వ డివిజన్లో ప్రచారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ 42వ డివిజన్‌కు చెందిన వైసిపి నాయకులు, యన్‌టిఆర్ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు కేసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశం మేరకు ఈ నెల 7వ తేదీ నుండి 20వ తేదీ వరకూ జరిగే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి జయప్రదం చేస్తున్నట్లు చెప్పారు.

మసీదుకు వాటర్ ప్లాంట్ బహూకరణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ 46వ డివిజన్ అలీనగర్‌లో ఉన్న అలీమసీద్ నందు తన తండ్రి షేక్ మహబూబ్ అలీ పేరు మీద వాటర్ ప్లాంట్‌ను కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా మొహినుద్దీన్ సోమవారం బహూకరించారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ ఖాజా మొహినుద్దీన్ భార్య ఫాతిమా బేగం పోటీ చేసి 1150 ఓట్లను సాధించారు. అప్పుడు అలీ మసీదు వారికి ఎన్నికల్లో వాగ్దానం చేసిన రీతిగా ఎన్నికల్లో ఓడిపోయినా మాట నిలబెట్టుకుని నాలుగు లక్షల రూపాయలతో వాటర్‌ప్లాంట్ బహూకరించారు.

జగన్ పాలనలో పన్నుల భారాలు : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్: జగన్ పాలనలో ఇంటి పన్నులు, చెత్త పన్నులతో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ మండిపడ్డారు. ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమం 51వ డివిజన్ అధ్యక్షులు బత్తుల వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పోతిన మహేష్ మాట్లాడుతూ జగనన్న స్టిక్కర్లు అతికించుకోవడానికి ఇష్టపడటం లేదని, జగనన్నే తమ దరిద్రం అని ప్రతిఒక్కరు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి నేమాని సంజీవరావు, కృష్ణా పెన్న మహిళా కమిటీ సభ్యురాలు మల్లెపు విజయలక్ష్మి ,కొరగంజి వెంకటరమణ, సిగానంశెట్టి రాము, పొట్నూరి శ్రీనివాసరావు, మల్లెపు విజయలక్ష్మి, ఏలూరు సాయి శరత్ తదితరులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్ సిఐగా గురుప్రకాష్

ప్రజాశక్తి-సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్ సిఐ ఎస్వీవీఎస్ లక్ష్మీనారాయణ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. గత మూడున్నర సంవత్సరాలకు పైగా సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయన సేవలందించారు. ఆయన స్థానంలో కొత్త సిఐగా ప్రస్తుతం ఎస్‌బిలో విధులు నిర్వహిస్తున్న గురుప్రకాష్ బదిలీపై రానున్నారు.

జ్యోతి ఆప్టికల్స్ నూతన బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: తెల్ల రేషన్‌కార్డుదారులు, నిరుపేదలు, 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి లాభాపేక్ష లేకుండా కళ్లజోళ్లు అందజేసేందుకు జ్యోతి ఆప్టికల్స్ నిర్వాహకులు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. విజయవాడ పటమట సెంటర్‌లో జ్యోతి ఆప్టికల్స్ నూతన బ్రాంచ్‌ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారలోపం కారణంగా చిన్నతనం నుండే కంటి చూపు మందగించే పరిస్థితులు ఎదురవుతుందన్నారు. కంటి చూపు మందగిస్తున్నట్లు గమనిస్తే వెంటనే నేత్ర పరీక్షలు చేయించుకుని వైద్యులను సంప్రదించాలన్నారు. జ్యోతి ఆప్టికల్స్ అధినేత వెలివెల ఉషారాణి మట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా ఉషా కంటి ఆసుపత్రి ద్వారా పేదలకు నిపుణులైన కంటి వైద్యులతో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. తెల్లరేషన్‌కార్డుదారులకు లాభాపేక్ష లేకుండా తక్కువ ధరకే కళ్లజోళ్లను అందజేస్తున్నామన్నారు. లయన్స్ క్లబ్ జర్నలిస్ట్ సంఘ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఇప్పటి వరకు దాదాపు సుమారు ఎనిమిది వేల మందికి పైగా కళ్లజోళ్లను ఉచితంగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ఆప్టికల్స్ నిర్వాహకులు వెలివెల సత్యనారాయణ, వి.వెంకటసుధీర్, వి.అర్జున్‌రావు, వి.వినయ్‌కుమార్, బి.నాగశయన, కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి.యు.వర్మ తదితరులు పాల్గొన్నారు.

విఎంసిలో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థలో కారుణ్య నియామకాలు జరిగాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇద్దరికి కారుణ్య నియామకపు ఉత్తర్వులను అందజేశారు. నగరపాలక సంస్థలో వివిధ విభాగములలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన వారి కుటుంబ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్హత ఆధారంగా జూనియర్ అసిస్టెంట్, (కండిషనల్ బేసిస్), ఆఫీసు సబ్ ఆర్డినేటర్ వంటి పోస్టింగ్‌లను కేటాయించామన్నారు. వీరు విధి నిర్వహణలో బాధ్యతయుతముగా నిర్వర్తించాలని కోరారు.

పేదల సంక్షేమానికి కృషి : ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని 16వ వార్డు చెరువు బజారు 6వ సచివాలయం పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. రానున్న కాలంలో మరిన్ని పథకాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు మరింత మేలు చేయనున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఫిరోజ్ ఖాన్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మెపల్లి నరేంద్ర, కౌన్సిలర్ తన్నీరు నాగేంద్ర, సచివాలయ కన్వీనర్లు తాళ్లూరు వెంకటేశ్వర్లు, వేముల ఝాన్సీ, గహ సారథులు ఒంటిపులి శివ, కుంచపు నాగరాజు, కరిసే ఉదయభాను, వేముల కాశయ్య, తాళ్లూరి వాసు, దండుగుల సురేష్,నాయకులు వేముల విజయ్, ఉప్పుతోళ్ల నాగేంద్రబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. వత్సవాయి మండలం దేచుపాలెం గ్రామానికి చెందిన ఎనిమిది కుటుంబాలు ఉదయభాను సమక్షంలో వైసిపిలో చేరాయి.

విద్యుత్ ఛార్జీలపై తప్పుడు ప్రచారం చేయడం తగదని ఉదయభాను అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచక ముందే పెంచినట్టుగా ప్రజలను మభ్యపెడుతూ నిరసనలు చేయడం వారి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. జగన్ పాలనలో తప్పులేమి కనిపించని ప్రతిపక్ష నాయకులకు అసత్య ప్రచారాలను సత్యాలుగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ కమిషనర్

ప్రజాశక్తి-వన్‌టౌన్

ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర దేవాదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శీఅమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన 'హైదరాబాద్ పవర్ ఇన్స్టాల్లేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థకు చెందిన వై. కేశవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయ గోపురం బంగారు తాపడం నిమిత్తం రూ.5,00,116 ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబని కలిసి సోమవారం దేవస్థానానికి విరాళంగా డిడి రూపంలో అందజేశారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అడ్డంకులు

ప్రజాశక్తి వత్సవాయి : భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో ఏర్పాటు చేసేందుకు కొంతమంది యువకులు నాంది పలికారు. ఈ తరుణంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఎస్సీ కాలనీకి సమీపంలో ఉన్న ఆర్ అండ్ బి స్థలంలో ఏర్పాటు చేస్తుంటే అగ్రకులానికి చెందిన కొంతమంది నాయకులు తమ సమాజా వర్గానికి చెందిన స్థానిక అధికారులతో అంతర్గతంగా చర్చలు జరిపి విగ్రహ నిర్మాణానికి అడ్డంకులు సష్టించడమే కాకుండా దళితులపై అవమానకరంగా హేళన చేస్తూ ఉద్దేశపూర్వకంగా అనేక రకాలుగా ఒత్తిడిలు తీసుకువస్తున్నారని దళితులు ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు. అధికార పార్టీ స్థానికత, సర్కిల్, మండల స్థాయి అధికారి ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన వారితో మాపై ఫిర్యాదులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన ఎస్సీలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండల తాసిల్దార్ తమ సొంత సామాజిక వర్గమానికి చెందిన వారి ఫిర్యాదు మేరకు పంచాయతీ ఆర్ అండ్ బి పోలీస్ వారికి దళితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు పంపినట్లు సమాచారం. మండల తాసిల్దార్ సొంత నియోజకవర్గానికి చెందిన అధికారి కావడంతో తమ సొంత సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రెవెన్యూ సేవలు దుర్వినియోగం చేస్తున్నట్లు నియోజకవర్గం లో ఆరోపణలు బాగా వినిపిస్తున్నాయి. అదే తరహాలో మక్కపేట అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును నిరాకరించడంలో ఆయన ప్రత్యేక పాత్ర పోషిస్తున్నట్లు మక్కపేట గ్రామస్తులు వాపోతున్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో అగ్రకులస్తుల కుట్రను పసిగట్టిన మాల మాదిగల కులాలకు బీసీ కులాలు కూడా తమ వంతుగా సహకరిస్తూ విగ్రహ నిర్మాణానికి అన్ని రకాలుగా సహాయం అందిస్తున్నట్లు సమాచారం. అధిష్టానం చొరవతో ఈ సమస్యను పరిష్కరించాలని లేదంటే గ్రామంలో గొడవలు సష్టించే అవకాశం ఉందని గ్రామస్తులు నుండి సమాచారం. కనుక ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో ఎటువంటి అలజడులు లేకుండా సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అలాగే అత్యుత్సాహంతో విగ్రహ నిర్మాణానికి అడ్డంకులు సృష్టిస్తున్న మండల స్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వచ్చే ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సు

● కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రామమోహనరావు

ప్రజాశక్తి- వన్‌టౌన్ : రానున్న విద్యా సంవత్సరం నుంచి కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ నాలుగేళ్ల కోర్సులను నిర్వహించనున్నట్లు ఆ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రామమోహ నరావు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని కష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఉన్న అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, యజమాన్యాల సమావేశం విశ్వవిద్యాలయం సీడీసీ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హజరైన ఆచార్య కె రామమోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా విశ్వవిద్యాలయం పరిధిలో అనేక నూతన చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా వచ్చే ఏడాది నుంచి డిగ్రీ కోర్సును నాలుగేళ్ల కాల పరిమితికి పెంచనున్నట్లు చెప్పారు. నాలుగో ఏడాదికి సంబంధించి విద్యార్థులు రీసెర్చ్, లేదా సాధారణ విద్యాభ్యాసం వైపు రెండు అవకాశాలను ఇవ్వటం జరుగుతుందన్నారు. దీనిపై త్వరలోనే విధివిధానాలను రాష్ట్ర విద్యాఉన్నత విద్యామండలి విడుదల చేయనుందన్నారు. కళాశాలలు విశ్వవిద్యాలయం పరిధిలో మరింత బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు విశ్వవిద్యాలయం అనేక నూతన నిర్ణయాలను తీసుకోనుందన్నారు. అందులో భాగంగా అనుబంధ కళాశాలలు సహకరించి తమనుతాము మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. విద్యార్థులను పారిశ్రామిక రంగానికి చేరువ చేయటంతో పాటుగా వారిలో వత్తినైపుణ్యాలను తీర్చిదిద్దేందుకు ఇంటర్న్‌షిప్ విధానం చాలా అండగా ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్‌కు సంబంధించి దేశంలో రాష్ట్రంలోని విద్యా విధానం మొదటి స్థానంలో ఉందన్నారు. దీనికి సంబంధించి విద్యార్థులకు మార్కులు కేటాయించే అంశంపై సైతం త్వరలోనే విధివిధానాలను ప్రకటించనున్నట్లు వివరించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయం వేరువేరుగా కాకుండా సమిష్టిగా విద్యార్థుల సమగ్రాభివద్ధికి చర్యలు తీసుకొని ముందుకు సాగటానికి అండగా ఉండాలని కళాశాలలను కోరారు. రానున్న విద్యా సంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లను సైతం ఈ ఏడాది త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులను మరింత విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు కళాశాలలు కషి చేయాలన్నారు. క్యాంపస్ ఇంటార్వ్యూలలో విద్యార్థులు అత్యధికంగా పొందే ప్యాకేజీ విషయంలో దేశంలోనే ఏపీ విద్యార్థులు రెండో స్థానంలో ఉన్నారన్నారు. రిజిస్ట్రార్ ఎం రామిరెడ్డి మాట్లాడుతూ ఆచార్య ఎం రామిరెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా అనేక నూతన సంస్కరణలకు ఉన్నత విద్యామండలి చర్యలు చేపడుతుందన్నారు. దానికి అనుగుణంగా కష్ణా విశ్వవిద్యాలయం సైతం తన పరిధిలోని కళాశాలలను మరింత బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సీడీసీ డీన్ డాక్టర్ డీ రామశేఖరరెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీన్ డాక్టర్ ఆర్ విజయకుమారి, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. రెండు జిల్లాల్లోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, యజమాన్యాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉపకులపతి రామమోహనరావు

రైల్వేస్టేషన్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎంపి

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : ప్రయాణికులు సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వ నిధులు, ఎంపీ నిధులు సంయుక్తంగా వెచ్చించి బందరు రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పనకు బందరు ఎంపి బాలశౌరి హామీ ఇచ్చారు. మచిలీపట్నంలో నూతనంగా ప్రారంభించిన రైల్వేస్టేషనులో మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు ఎదురు కుంటున్న ఇబ్బందులపై సోమవారం ఎంపి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు నూతనంగా నిర్మించి ప్రారంభించిన రైల్వేస్టేషన్లో సదుపాయాలు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురౌతున్నారని తమ దష్టికి వచ్చిందని చెప్పారు. ఒక ప్లాట్ఫారం నుండి మరొక ప్లాట్ఫారంకు ప్రయాణికులు ముఖ్యంగా వద్ధులు తేలికగా చేరే విధంగా రెండు ఎస్కలేటర్లు (లిఫ్టులు) కల్పించే విధంగా తన వంతు కషి చేస్తామన్నారు. మచిలీపట్నం రైల్వేస్టేషను స్వయంగా సందర్శించి, ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

లీజుకు గన్నవరం ఆర్‌టిసి స్థలం

ప్రజాశక్తి-గన్నవరం : ఎపియస్ఆర్‌టిసి కమర్షియల్ లో భాగంగా గన్నవరం బస్ స్టేషన్ పక్కన ఖాళీ స్థలమును 3- భాగాలుగా విభజించి 15 సంవత్సరాల పాటు అద్దెకు ఇవ్వటానికి ప్రతిపాదించినట్లు డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బస్టాండ్ 1534 చదరపు గజాలు ఒక భాగం గాను, డిపో పక్కన గల ఖాళీస్థలం 597 చదరపు గజాలు ఒక భాగం గాను, దాని పక్కన 900 చదరపు గజాలు మరొక భాగం గాను అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులైన వ్యాపారవేత్తలు వారికి అనుకూలమైన, అనుమతించబడిన ఏవ్యాపార మైనను నిర్వహించుకోవచ్చన్నారు. ఏప్రిల్ 15 వ తేదీ వరకు ఆన్లైన్ టెండర్ ఫారం డౌన్ లోడ్ చేసుకొని ఈనెల 17 వతేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విజయవాడ పండింట్ నెహ్రూ బస్టాండ్ కార్యాలయంలో దరఖాస్తులు స్వయంగా అందజేయాలన్నారు. అదేవిధంగా ఉంగుటూరు బస్టాండ్ లో కూడా స్థలం లీజుకు ఇవ్వబడును అని చెప్పారు. ఆసక్తి గలవారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిత్ర లేఖనంలో 'సెయింట్ జాన్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం : విద్యార్థులలోని సృజనకు పదునుపెడితే ఏ రంగంలోనైనా నైపుణ్యాన్ని సాధించటం సాధ్యమని సెయింట్ జోన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ , విజయవాడ వారు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో తమ పాఠశాల పాల్గొని తమ ప్రతిభను సాటినట్లు ఆయన తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో జి. న్వయన్ రెడ్డి ప్రథమస్థానం , జూనియర్ విభాగంలో కె. శశాంక్ ప్రథమస్థానం మరియు సీనియర్ కేటగిరిలో యం. మోక్ష శ్రీ, బి సూరజ్ లు ప్రథమ స్థానం పొందారని అన్నారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు డి. శ్రీనివాసరావు ను అభినందించారు. సీనియర్ రెవ. బ్రదర్ జిమ్మీకురియేకోస్‌ను పాఠశాల రెవ.బ్రదర్. భల్లాజోసఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

'మా నమ్మకం నువ్వే జగన్' ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్‌జంక్షన్) : మా నమ్మకం నువ్వే జగన్' అనేది ప్రజల నినాదమని రాష్ట్ర నాటక రంగా డైరెక్ట్ నక్క గాంధీ తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో సంతప్తి వ్యక్తమవుతోందన్నారు. సోమవారం వేలేరు, రేమల్లి, వీరవల్లి, రంగన్నగూడెం, మలవల్లి గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నక్క గాంధీ లాంఛనంగా ప్రారంభించారు. ప్రజాప్రతినిధులతో పాటు వైసీపీ సచివాలయ కన్వీనర్లు, గహసారథులతో కలిసి పలు కుటుంబాలను నేరుగా కలిశారు. చంద్రబాబు పాలనకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను వివరించి ప్రజల మద్దతు కోరారు.ఈ కార్యక్రమంలో బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, బాపులపాడు జడ్పిటిసి కొమరవెల్లి గంగాభవాని, బాపులపాడు పి.ఎ.సి.ఎస్ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకట రామాంజనేయులు, మండల పార్టీ కన్వీనర్ అవిర్నేనీ శేషగిరి పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-కోడూరు : హంసలదీవి పవిత్ర సంగమ ప్రదేశం వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోడూరు మండల జనసేన నాయకులు సోమవారం కోడూరు మండల తాసిల్దార్ ఎస్ కె లతీఫ్ పాషా కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి సంగమ ప్రదేశం వద్దకు వచ్చు యాత్రికులకు, ఇక్కడి పరిస్థితులు తెలియనందున పలు ప్రమాదాలు జరుగుతున్నాయని కావున సంగమ ప్రదేశంలో యాత్రికుల రక్షణ కోసం భారీ గేట్లను, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య వికాస విభాగ కార్యదర్శి లంకె యుగంధర రావు, మండల నాయకులు ఉల్లి శేషగిరిరావు, బడే వెంకటేశ్వరరావు, గేదె రమేష్, స్థానిక జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



'ఆర్గానిక్ కెమిస్ట్రీ మాన్యువల్ ' ఆవిష్కరణ

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : కృష్ణా యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి. రామశేఖరరెడ్డి రచించిన 'ఆర్గానిక్ కెమిస్ట్రీ ల్యాబరేటరీ మాన్యువల్' పుస్తక్కాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ కే. రామమోహనరావు సోమవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ విద్యను డిగ్రీ, పీజీలో అభ్యశిస్తున్న విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తకాన్ని రచించిన రచయిత డాక్టర్ డి. రామశేఖరరెడ్డిని వైస్ ఛాన్సెలర్ కే. రామ మోహన రావు అభినందించారు. నూతన విద్యా విధానాన్ని అనుసరించి రాసిన ఈ పుస్తకంలో రసాయన శాస్త్ర విద్యార్థులు పరిశోధనలలో పాటించవలసిన సురక్షిత విధానాలతో పాటు అనేక కత్యాల గురించి విపులంగా వివరించడం జరిగిందని రచయిత డాక్టర్ డి. రామ శేఖర రెడ్డి తెలిపారు. ఈ పుస్తకాన్ని తన గురువు ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ రసాయన శాస్త్ర ఆచార్యులు వెంకటేశ్వర్లు కి అంకితమిస్తున్నట్లు రామశేఖరరెడ్డి తెలిపారు.

14న మద్యం విక్రయాలు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14వ తేదీన మద్యం విక్రయాలను నిలుపుదల చేయాలని జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సముద్రాల అంబేద్కర్ కోరారు. సోమవారం ఆయన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్‌విఎస్ రామకష్ణను కలిసి మెమోరాండం అందజేశారు.

రెండు తలల మేక పిల్ల జననం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని తోట్ల వల్లూరు గ్రామానికి చెందిన వల్లూరు శ్యామ్ చార్లెస్ కు చెందిన మేక ప్రసవంలో రెండు తలల మేక పిల్లకు జన్మనిచ్చింది. సోమవారం తన ఇంటి వద్ద రెండు తలలు మేక పిల్లకు జన్మనివ్వడంతో గ్రామం లోని ప్రజలంతా ఆసక్తిగా చూశారు. కొంతసేపటి తర్వాత ఆ మేక పిల్ల మృతిచెందింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు / పెన్షనర్లకు పెన్షన్లు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న పిఆర్ సి, 4 డిఎల ఎరియర్స్ చెల్లించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అమరావతి జేఏసీ కష్ణా జిల్లా కమిటీ ప్రతినిధులు సోమవారం స్పందనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం మలిదశ ఉద్యమ కార్యాచరణకులో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సెల్ ఫోన్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు.కాబట్టి ఒక్కరోజు ప్రభుత్వ ఉద్యోగులంతా సెల్ ఫోన్ వినియోగించకుండా ఉద్యోగులలో ఉన్న ఆవేదనను, నిరసనను ప్రభుత్వానికి తెలియజేసేలా ఈ సెల్ డౌన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కష్ణ జిల్లా ఏపీ జేసీ అమరావతి చైర్మన్ టి. సతీష్ కుమార్, సెక్రటరీ వై వి రావ్, కోశాధికారి విజయ కుమార్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు,ఎపి ఆర్ ఎస్ ఏ జిల్లా సెక్రటరీ ఎం వి. శ్యామ్ నాధ్, కలెక్టరేట్ మరియు డివిజన్ ప్రెసిడెంట్ పామర్తి శ్రీనివాసరావు ,మరియు సెక్రటరీ కార్యవర్గ సభ్యులతో పాటు , వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అంబేద్కర్ జయంతి సందర్భంగా 13న జాషువా సాంస్కృతిక వేదిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - విజయవాడ

బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈనెల 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారను. గవర్నరుపేటలోని బాలోత్సవ భవన్ 2వ అంతస్తులో కొల్లూరు వెంకట్‌చే 'రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ', హసీనా బృందం వారిచే దేశమును ప్రేమించుమన్న గీతం, అనంతరం వీడియో షో (అంబేద్కర్‌పై పాట, వేమన పద్యాలు - భావాలు, నెల్సన్ మండేలా పాటలు, ఇది మనువాదపు కుతంత్రమా...జాషువా పాటకు నృత్య నీరాజనం, సావిత్రీ బాయి పూలే పాటలకు నృతం తదితర కార్యక్రమాలు అనిల్ డ్యానీ నిర్వహణలో జరుగుతాయి. అనంతరం 'సామాజిక న్యాయం - లౌకికతత్వం' అంశంపై జరిగే కార్యక్రమంలో ఎస్‌సి రైల్వే డిపిఒ ఎం.బాల మురళీ, బిఎస్‌ఎన్‌ఎల్ సిఎఒ బి.రవికుమార్, న్యాయవాది పి.రాంబాబు, రిటైర్డు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎ.గుప్త, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఎఫ్‌పిఇ పి-4 పూర్వ డిప్యూటీ సెక్రటరీ తదితరులు పాల్గొంటారు.

కలిమిశ్రీకి జాషువా పురస్కారం

ప్రజాశక్తి - విజయవాడ

సాహితీవేత్త, నవమల్లెతీగ సాహిత్య పత్రిక సంపాదకుడు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీకి మహాకవి గుర్రం జాషువా స్మారక అవార్డు లభించింది. తెలుగు సాహిత్యానికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈనెల 23న తెనాలిలో జరిగే గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 35వ వార్షికోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పెద్దింటి యోహాన్ తెలిపారు. కలిమిశ్రీని 'సాహితీ తపస్వి' బిరుదుతో సత్కరించనున్నట్లు తెలిపారు. కలిమిశ్రీ మూడున్నర దశాబ్దాలుగా పత్రికారంగంలో కొనసాగుతున్నారు. ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, జ్యోతిచిత్ర పత్రికల్లో ఉప సంపాదకులుగా పని చేశారు. పలు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2007 నుండి నవమల్లెతీగ మాసపత్రిక వ్యవస్థాపక సంపాదకులుగా ఉండి దానిని నడుపుతున్నారు.

మామిడి, మిర్చి, పత్తి ఎగుమతులకు రుణాలు

బ్యాంకర్లకు కలెక్టర్ డిల్లీరావు సూచన

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో మామిడి, మిర్చి, పత్తి పంటల ఎగుమతులను ప్రోత్సహించేలా బ్యాంకర్లు రైతులు, ఎగుమతి దారులకు విరివిగా ఋణాలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు కోరారు. స్థానిక కలెక్టర్ విడిది కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు అధ్యక్షతన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ - డిసిసి) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ 2023-24 వార్షిక రుణ ప్రణాళిక (యాన్యువల్ క్రెడిట్ ప్లాన్)ను కలెక్టర్ డిల్లీరావు విడుదల చేశారు. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ ఏడాది రూ.39,000 కోట్లు వార్షిక ప్రతిపాదిత ఋణ ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించామని కలెక్టర్ చెప్పారు. వీటిలో ప్రాధాన్యత రంగాలకు రూ.19,000 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు 20,000 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. ప్రతిపాదిత ఋణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.8,500 కోట్లు కేటాయించగా, కౌలు రైతులతో సహా 5.10 లక్షల మంది రైతులకు

వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

రుణాల మంజూరు నిర్దేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (యంఎస్‌యంఇ) రంగాలకు 7,800 కోట్ల రూపాయలు, గృహ నిర్మాణానికి 1000 కోట్ల రూపాయల రుణాల లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది. ఎగుమతి రంగానికి రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జిల్లాలోని 292 గ్రామ పంచాయతీలలో 8 ప్రధాన బ్యాంకుల శాఖల ద్వారా క్యాంపులు నిర్వహించాలని కోరారు. డిసిసి, కన్వినర్, యూనియన్ బ్యాంక్ డిజిఎం యువి రజినీకాంతారావు, ఎల్‌డియం పి కోటేశ్వరరావు, నాబార్డ్ డిజియం మిళింద చౌల్కర్, డిఆర్‌డిఏ పిడి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టాలి : కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా పరిధిలో యథేచ్ఛగా మట్టి అక్రమ మైనింగు జరుగుతోందని, దీనిని అరికట్టాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొలనుకొండ శివాజీ తదితరులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం జరిగిన స్పందనలో వినతిపత్రం సమర్పించారు. వందలాది లారీల మట్టిని ఇష్టారాజ్యంగా తరలించుకుపోతున్నారని, దీనిపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని కోరారు. ముఖ్యంగా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి పరిధిలో 150 ఎకరాల పరిధిలో ఈ మైనింగ్ జరుగుతోందని, పోలవరం కుడికాల్వ మట్టిని తరలించుకుపోతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ, మైనింగు విభాగాలకు సెస్ కట్టకుండా జరుగుతున్న ఈ మైనింగులో ప్రభుత్వానికి కొట్లాది రూపాయల నష్టం జరుగుతోందని, ఇప్పటి వరకూ 1.5 లక్షల లారీల మట్టిన తరలించారని వివరించారు. అడ్డుకున్న అధికారులను బదిలీ చేస్తున్నారని, మైనింగు చేస్తున్న లారీలను పట్టుకుంటున్నా రాజకీయ నాయకులు ఫోన్లు చేయగానే వదిలేస్తున్నారని వినతిపత్రం లో పేర్కొన్నారు. దీనిపై లోతైన విచారణ జరపాలని కోరారు. నిందితులపై పిడి చట్టం కింద కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కొలనుకొండ శివాజీ

స్టడీ ప్యాడ్లు పంపిణీ చేస్తున్న జమలపూర్ణమ్మ

విద్యార్థులకు స్టడీ ప్యాడ్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ ఉమ్మడి కష్ణాజిల్లా చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివద్ధికి సంఘం అందించిన సేవలు ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. ఈ సందర్భంగా గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల మెంటార్ నిమ్మగడ్డ రామాంజనేయులు తన మాతమూర్తి నిమ్మగడ్డ శార్వాణి జ్ఞాపకార్థం రూ.5 వేల విలువైన 50 స్టడీ ప్యాడ్లను విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాదికారిణి కె.రమాదేవి, గ్రేడ్ 3 గ్రంథ పాలకురాలువై.ధనలక్ష్మి, రికార్డ్ అసిస్టెంట్ కె.రాంబాబు, జె.శంకర్, గోపాలరావు, ఫణి బాబు, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
E.A. No. 187/2021 in E.P. No. 33/2019 in O.S. No. 29/2017

బిట్వీన్
వీర్ల కన్యాకుమారి ... పిటీషనరు / క్లయిము పిటీషనర్
అండ్
1. గార్లపాటి కృష్ణమూర్తి వగైరాలు ... రెస్పాండెంట్లు
రెస్పాండెంట్ నెం.4 : బుర్రా శ్రీలక్ష్మి, భర్త : లేటు సోమిరెడ్డి, వయస్సు 32 సం॥లు, హిందువు, డోర్ నెం. 15-71బి, ఆంజనేయపేట, గుడివాడ, కృష్ణాజిల్లా.

పై నెంబరుగల క్లయిము పిటీషనులో 4వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేసియున్నారు. కావున పై నెంబరు ఇ.ఎ.లో మీ హాజరు నిమిత్తం ది. 19-04-2023న వాయిదా వేసినారు.కాబట్టి మీరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల మీకు పరోక్షముగా విచారణ జరిపి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా: 19-04-2023
రావూరి రవికుమార్,
న్యాయవాది, గుడివాడ.
గుడివాడ.
10-04-2023
సెల్ : 9985117543.

IN THE COURT OF THE MACT CUM HON'BLE XXVI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT AT :: HYDERABAD, TELANGANA
O.P. NO. **995** OF **2019**

Between :
G. Victoriya & Another ... Petitioners
AND
M. Salmen & Others ... Respondents

To,
Pathan John Khan, S/o. Vajeer Khan, Age: Major, Occ.: Lorry owner, R/o. D.No.4-145, Kachavaram Village, Ibrahimpatnam Mandal, Krishna District - 521456 ... R2

Whereas the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under the M.V. Act.

Please take notice that the above O.P. stands posted to **25-04-2023** for your appearance. you are required to appear before Hon'ble Court at **10: 30** am on the above date either in person or through and advocate. failing which the matter will be decided exparte.

BY ORDER OF THE COURT
K.V. Radhika
Advocate
Flat No. 303, Chetanraj Residency
Lane No.2, Street No.6, Gaganmahal,
Domalaguda, Hyderabad Telangana
Mobile : 9441375842

మొదటి పేజీ తరువాయి

భానుడు భగభగ

పది రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. రెండు మూడు రోజుల్లో 3 డిగ్రీల నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పెరిగి అవకాశం ఉందని సమాచారం. అంటే దాదాపు 43 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు చేరుకోనున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలే కాకుండా కనిష్ట ఉష్ణోగ్రతల్లో కూడా మార్పులు చోటు చేసుకోనున్నాయి. కనిష్టంగా 24, గరిష్టంగా 40 ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. మంగళవారం కనిష్ట ఉష్ణోగ్రత 25, గరిష్టంగా 41, బుధవారం కనిష్టంగా 26, గరిష్టంగా 41, గురువారం కనిష్టంగా 26, గరిష్టంగా 42 డిగ్రీల సెల్సియస్‌ల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. ఇక శుక్రవారం నుంచి ఆదివారం వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు 26, గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదు అయ్యే అవకాశం ఉంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, హీట్‌వేవ్ పరిస్థితులకు సంబంధించిన సమస్యల పరిష్కరానికి ఎపిఎస్‌డిఎంఎ వారు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. సమాచారం కోసం ప్రజలు 1070 లేదా 1800 425 0101కు కాల్ చేసి తెలుసుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆరుబయట పని చేసే వారు మధ్యాహ్నాంక ముందే పనులు పూర్తి చేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఎక్కువ సేపు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం, నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్ళు తరచుగా తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ సమస్యలను అధికమించొచ్చు. వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు ఎండలకు దూరంగా ఉండటం మంచింది.

కోవిడ్‌పై అప్రమత్తం

లేదన్నారు. అయినా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఏడుగురులో ఈ కోవిడ్ వేరియంట్ లక్షణాలను గుర్తించామని, వారికి ప్రత్యేక చికిత్సను అందిస్తున్నామని తెలిపారు. విజయవాడ పభుత్వ జనరల్ ఆస్పత్రిలో 31 పడకలతో ప్రత్యేక కోవిడ్ విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్యులను, మందులను, పిపి కిట్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు మాక్ డ్రిల్‌ను నిర్వహించి వైద్యాధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. దాదాపు 95 శాతం మందికి రెండు విడతల కోవిడ్ వ్యాక్సిన్‌ను, అవసరమైన వారికి అదనపు బూస్టర్ డోస్‌ను అందించినట్లు తెలిపారు. వ్యాక్సిన్ తీసుకున్న వారిలో వైరస్ లక్షణాలు తక్కువగా కనిపిస్తాయని, సాధరణ చికిత్స ద్వారా వైరస్ బారి నుండి రక్షించగలుగుతామని అన్నారు. ప్రజలు కోవిడ్ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. గతంలో మాదిరిగా తరచూ చేతులను శుభ్రపరచుకోవడం, మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి రక్షణ చర్యలను తీసుకుంటే వైరస్‌కి దూరంగా ఉండగలుగుతామన్నారు. మాక్ డ్రిల్ పరిశీలనలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డిహెచ్‌అండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధి, భూమి, ఇళ్ల సమస్యలపై 14 నుండి సైకిల్ యాత్రలు

యాత్ర పామర్రు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, కంకిపాడు, ఉయ్యూరు మీదుగా పెదపారుపూడి చేరుతుందని తెలిపారు. ఈయాత్రల అనంతరం సచివాలయాలు, మండల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు జరుగుతాయని శీలం ప్రకాశరావు, మురాల రాజేష్ తెలిపారు. పీడిత ప్రజల విముక్తికి అలుపెరగని పోరాటాలు నడిపి దేశంలోనే మొట్టమొదటిగా వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి రోజైన మే 19న మచిలీపట్నంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో నేటికీ సుమారు 75 శాతం మంది ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారని, వీరిలో 80 శాతం మంది గ్రామీణ నిరుపేదలుగా ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయని అన్నారు. వీరిలో అధికశాతం వ్యవసాయ ఆధారిత కూలిపనులు, ఉపాధి హామీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వాలు తాము లక్షల ఎకరాలు పంచామని ఎన్ని గొప్పులు చెప్పుకున్నా నేటికీ గ్రామాల్లో భూకేంద్రీకరణలో పెద్ద మార్పు రాలేదన్నారు. గ్రామాల్లో నివశించే దళితుల్లో 70 శాతం మంది, ఇతర బిసి తరగతుల పేదల్లో 40 శాతం మంది భూమి లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. మరోవైపు చేపలు, రొయ్యల అక్రమసాగు విపరీతంగా పెరిగిందన్నారు. దీంతో వేల ఎకరాల అసైన్డ్ భూములు, సముద్రతీర బంజర్లు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. అలాగే లంకల్లో వేల ఎకరాలు భూకామందుల చేతుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అయినా రెవెన్యూ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సాగుభూమి సాధించుకోవడానికి పేదలంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. అలాగే ఉపాధిహామీ చట్టం వచ్చిన దగ్గర నుండి దాన్ని ఎలా ఎత్తివేయాలని ప్రభుత్వాలు ఆలోచిస్తూనే ఉన్నాయని, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి గ్రామాల్లో అగ్రకుల పెత్తందారులు, ధనిక రైతులు ఈ చట్టాన్ని ఎత్తివేయాలని ప్రభుత్వాలపై ఎత్తిడి పెంచుతున్నారని వివరించారు. దీనిలో భాగంగానే రెండు పూటలా పని, ఆన్లైన్ మస్తర్లు, మేటికి ఇచ్చే పారితోషికం ఎత్తివేయడం, ఎఫ్‌ఎలను తొలగింపు వంటి కుట్రలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముమ్మరం చేసిందన్నారు. నిజానికి ఈ చట్టం లేకుంటే 2020, 2021 కరోనా కాలంలో చాలామంది ఆకలితో చనిపోయేవారని తెలిపారు. 2023-24 బడ్జెట్లో కేంద్రం రూ.30 వేల కోట్ల నిధులను ఉపాధి హామీ చట్టానికి తగ్గించి వేసిందన్నారు. ఈ పరిస్థితులలో ఈ చట్టాన్ని నిలబెట్టుకోవడానికి, మరింత మెరుగుపర్చుకోవడానికి అందరూ కదలాలన్నారు. అలాగే ఇళ్లు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు సాధించుకునే విషయంలో ఒక్కో గ్రామంలో ఒక్కో రకమైన సమస్య నెలకొని ఉందన్నారు. కేంద్రం ఇచ్చే రూ.1.80 లక్షలు జగనన్న ఇల్లు కట్టుకోవడం సాధ్యంకావడం లేదని, అందువల్ల ఒక్కో ఇంటికి రూ.6 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గత ప్రభుత్వాల కాలంలో ప్రారంభమైన ఇళ్లకు ఈ ప్రభుత్వం మంజూరులు ఆపేసిందని, దీంతో అప్పులు చేసిన పేదలు అల్లాడిపోతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14 నుండి నిర్వహించనున్న కార్యక్రమాల్లో గ్రామీణ పేద ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, ఏ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'స్పందన'కు గైర్హాజరైతే చర్యలు : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : స్పందనకు ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు అయితే చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ అపరాజిత సింగ్ స్పష్టం చేశారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందనలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జె సి మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి రీఓపెన్ అర్జీలు 25 వరకు వచ్చాయని శాఖల వారిగా సమీక్షిస్తూ వెంటనే పరిష్కరించాలని వీటిని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజెన్స్ , దివ్యాంగులు, అంగ వైకల్యంగల పాఠశాల విద్యార్ధులకు ఏపే పరికరాలు అవసరమో వాటిని మంజూరు చేయుటకు వెంటనే అవసరమైన ప్రతిపాదనలు పంపాలని వివిధ సంక్షేమశాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్ధులలో అంగ వైకరులను గుర్తించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వారికి ఏపే పరికరాలు అవసరమై జాబితాలు పంపాలన్నారు. జిల్లాలో రీ సర్వే పనులు సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు సంబంధించి సర్వే పూర్తయిన గ్రామాల్లో ఇప్పటిదాకా 48 వేల రాళ్ల ఏర్పాటు చేసినట్లు ఈ పనులు వేగవంతంగా నిర్వహించాలని సర్వే అధికారులను ఆదేశించారు.

స్పందన అర్జీలు : బందరు మండలం పోతేపల్లి గ్రామ పరిధిలో 1984-86 మధ్యకాలంలో కొనుగోలు చేసుకున్న ఇళ్లస్థలాలు వారి సర్వే నెంబర్లు 22ఎ క్రింద నిషేధిత జాబితా నుండి తొలగించి రెగ్యులేషన్ చేయించాలని కోరుతూ పలువురు మాజీ సైనికులు పి శ్రీనివాసరావు ఎస్ విజయవర్ధన్ రావు ఎస్ నాగమణి షరీఫ్ కే ప్రసాద్ రావు లు, ఇందిర దేవి,లక్ష్మి లు స్పందనలో అర్జీ సమర్పించారు.

పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి రైతు సంఘం :రైతు సంఘం

2020 ఏప్రిల్ 9వ తేదీని కురిసిన అకాల భారీ మరియు వడగండ్ల వానకు కష్ణా జిల్లాలో కత్తివెన్ను బంటుమిల్లి తదితర మండలాల్లో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని కానీ ఇప్పటివరకు నష్టపరిహారం అందించలేదన్నారు. అధికారులు 4524 మంది రైతులు దాదాపు 3,36,81,100 ,లు నష్ట పరిహారం ప్రకటించారని

అయినా నేటికీ అందలేదన్నారు. కాబట్టి ఉన్నాతాధికారులు వెంటనే నష్ట పరిహారం అందించే ఏర్పాటు చేయాలని అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాపుల పాడు మండలం మరియు పరిసర ప్రాంతాల్లో మినుము,పెసర , మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని కూడా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరీశెట్టి నాగేశ్వరావు,సంఘ నాయకులు తోట సాంబశివరావు ,ఆవుల బసవయ్యలు ఉన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, కెఆర్జిఆర్సి డిప్యూటీ కలెక్టరు బి. శివనారాయణ రెడ్డి, ఆర్డివో ఐ.కిషోర్, ట్రైని డిప్యూటీ కలెక్టరు చైతన్య, జాయింట్ కలెక్టరుతో పాటు ప్రజల నుండి అర్జీలు స్వీకరించగా, సిపిఓ వై. శ్రీలత, డిఆర్డిఎ పివో పిఎస్ఆర్ ప్రసాద్, సర్వే, ఎడి గోపాల్ రాజ్, మూడ విసి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చినఓగిరాలలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-ఉయ్యూరు : పేదల ఇళ్లనిర్మాణంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని మాజీ ఎమ్మెల్యే, పెనమ లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ బోడె ప్రసాద్ ఆరోపించారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా సోమవారం చినఓగిరాలలో పర్యటించి ప్రజల సమ స్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో పేదల కొరకు ఇళ్ల స్థలాలు ఊరికి దూరంగా పల్లపు ప్రాంతాల్లో సేకరించి వైసీపీ నాయకులు కోట్లాది రూ పాయలు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. సేకరించిన పొలాల్లో కొన్ని గ్రామా ల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఇంతవరకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పట్టణ ప్రాంతాల్లో పేదలకు అన్ని మౌళిక వసతులతో ధనవంతు లు నివసించే ఇళ్లవలే బహుళ అంతస్తులతో టిడ్కో ఇళ్ళు చంద్రబాబు నిర్మిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైనా ఇంతవరకు వాటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పార్టీ అధ్యక్షు డు కుటుంబరావు, సర్పంచ్ యెనిగళ్ల శిరీష, గ్రామపార్టీ అధ్యక్షుడు రామకష్ణ, ఎంపీటీ సీ శివప్రసాద్, పార్టీ నాయకులు బి. పిచ్చిరెడ్డి, కాటూరు శరత్, ఏడుకొండలు, జయదే ఎ. పాలడుగు రామకష్ణ, పోతిరెడ్డి, మాదవి, పాలడుగు బాలాజీ తదితరులు పాల్గొన్నారు

ఇఫ్తార్ విందుకు స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముస్లిం సోదరులకు సిఎం జగన్ ఏర్పాటు చేసేయు ఇఫ్తార్ విందుకు అనువైన స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా , సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం ఆధ్వర్యంలో పోలీసు అధికారులు , జిల్లా అధికారులతో విద్యాధరపురం ఆర్.టి.సి. డిపో సమీపంలోని ఖాళీ స్థలంతో పాటు గుప్తా సెంటర్లోని షాదీఖానా ప్రదేశాలను పరిశీలించారు. ఇఫ్తార్ విందు స్థలం , పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసే కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్ల గురించి ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డిల్లీరావు, నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.... ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయుటకు విద్యాధరపురం ఆర్.టి.సి. డిపో సమీపంలోని ఖాళీ స్థలము, గుప్తా సెంటర్ లోని షాదీఖానా ప్రదేశాలను వాటి పరిసర ప్రాంతాలను పరిశీలించామన్నారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసే ప్రదేశం , పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయము చేసుకుని పటిష్ట బందోబస్త్ ఏర్పాట్లు చేస్తామన్నారు. వారు వివరించారు.పశ్చిమ ఎం.ఎల్.ఏ. వెల్లంపల్లి శ్రీనివాస్ , మునిసిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్, ట్రాఫిక్ ఏ.డి.సి.పి. సర్కార్ పశ్చిమ ఏ.సి.పి.డా.కె.హనుమంతరావు, ట్రాఫిక్ ఏ.సి.పి. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పంచాయతీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పాత పద్దతిలోనే పంచాయితీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, మూడున్నరేళ్ళగా నిలిపివేసిన గ్రామ పంచాయతీ బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మునిసిపాలిటీ లోని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఛాంబర్లో సోమవారం సమావేవం జరిగింది. ఈంసదర్భంగా బాబూ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలను, వాలంటీర్లను సర్పంచుల ఆధ్వర్యంలోకి తీసుకురావాలన్నారు. సర్పంచులకు, ఎంపీటీసీలకు రు. 15వేలు, ఎంపీపీలకు జడ్పిటిసిలకు రు. 30వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ ముత్యాలరావు పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు

ప్రజాశక్తి...గన్నవరం (జంక్షన్) : బాపులపాడు మండలం వీరవల్లీ లింగమనేని శ్రీనివాసరావు చిన్ని రైసు మిల్లు అవరణంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన్ బేనర్జీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లీంలు, టిడిపి నాయకుల పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని అనంతరం ఇఫ్తార్ విందు స్వీకరించారు. టిడిపి రాష్ట్ర నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్ ,మండల పార్టీ కార్యదర్శి పుట్టా సురేష్, లింగమనేని శ్రీనివాసరావు చిన్ని లింగమనేని ఉమామహేశ్వర రావు కలపాల నాని,

కలపాల రాజబాబు ఎంపీటీసీ అమతపల్లి సూర్య నారాయణ, గ్రామ పార్టీ కార్యదర్శి తోమ్మండ్రు జోజి ప్రతాప్ పార్లమెంటరీ తెలుగు యువత నాయకులు మండాది రవీంద్ర ,గ్రామ ఉపసర్పంచ్ లంక అజయ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీలంకమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 7,80,293

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో వేంచేసి ఉన్న శ్రీలంకమ్మ అమ్మవారి హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. ఇటీవల అమ్మవారి వార్షిక జాతర నిర్వహించగా గత నెల 27వ తేదీ నుండి ఈనెల 10వ తేదీ వరకు 14 రోజులపాటు భక్తులు సమర్పించిన కానుకలను హుండీ ఆదాయాన్ని మచిలీపట్నం డివిజన్ దేవాలయాల తనిఖీ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ. 7,80,293 ఆదాయం లభించినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి పి సీతారామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు, కమిటీ సభ్యులు

పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-పెడన : పెడన పట్టణ నివసిస్తున్న చేనేత కులానికి సంబంధించిన దేవాంగ, ఇతర కులాల వారికి ఎన్నో దశాబ్దాల నుండి దీర్ఘకాలిక సమస్యగా ఉన్న హిందూ స్మశాన వాటిక అభివద్ధి కషి చేయాలని కోరుతూ పెడన పట్టణంలో ఉన్న దేవాంగ ప్రముఖులు మచిలీపట్నంలో ఎంపీ బాలశౌరిని తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్మశాన అభివద్ధికి తన వంతు కషి చేస్తానని, అభివద్ధికి కావలసిన నిధులను మంజూరు అయ్యేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. పట్టణ దేవాంగ ప్రముఖులు యర్ర సోమలింగేశ్వరరావు, పేరక బాబు, పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనంద్ బులసరా విశ్వనాథం, ఉట్ల వాసుదేవరావు, బల్ల గురు, వార్త పైడేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసే అర్హత లేదు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుడివాడ నియోజకవర్గంలో క్రైస్తవ సంఘ కాపరుల ఆత్మీయ సమావేశ కుడిక ఏర్పాటు చేసే అర్హతలేదని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ రెవరెండ్ డాక్టర్ జాన్ బెన్నీ లింగం విమర్శించారు. మండలంలోని కూరాడ లాక్ డౌన్ ఏఐసీసీ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఆయన ప్రసంగాలలో క్రైస్తవులను విమర్శిస్తూ క్రైస్తవ మనోభావాలను దెబ్బతీస్తూ చులకనగా మాట్లాడాడని అన్నారు. జగన్మోహన్రెడ్డి క్రైస్తవులను హక్కున చేర్చుకుని అన్ని మతాలను సమాన దృష్టితో చూస్తున్నారన్న అక్కసుతో క్రైస్తవ ఓట్లను కల్లగొట్టడానికి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్ర ్మాన్ని ఏర్పాటు చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి స్టేట్ సెక్రెటరీ ముత్యాల జయ రాజు, గుడ్లల్లేరు , ముదినేపల్లి మండల ఎఐసిసి కన్వీనర్ ఇమ్మానుయేల్,పులి జాన్ విక్టర్, సుశీల రాజు చంటి యోహాను తదితర క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : ఉంగుటూరు మండలం నందమూరు గ్రామ సచివాలయాన్ని ఎండిఒ జి.ఎస్.వి శేషగిరిరావు సోమవారం సందర్శించి మిషన్ వాత్సల్య పథకం మార్గదర్శకాలు గ్రామ ప్రజలకు, సచివాలయ సిబ్బందికి తెలియ జేశారు. అర్హులైన వారు ఈ నెల (ఏప్రిల్) 13 వ తేదీలోపు అప్లికేషను మరియు సర్టిఫికేట్లు గ్రామ సచివాలయంలో ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయ రికార్డులు పరిశీలించారు. గ్రామ సర్పంచ్ టి.బేబి, ఎం.అమీర్ బాష పాల్గొన్నారు.

14న అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-పమిడిముక్కల : బహుజన సాహిత్య అకాడమీ అవార్డులను వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ఈ నెల 14వ తేదీన గౌతు లచ్చన్న ప్రాంగణంలో ఇస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్ష జంపాన శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని గురజాడ గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పెనమలూరు ఎంఎల్ఎ కొలుసు పార్థసారధి, పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక, జంపాన పూర్ణిమ, వడ్డే శోభనాధేశ్వరరావు పాల్గొంటారన్నారు.

చెరువులు నింపుకోవాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : తాగునీటి కోసం చెరువులు నింపుకోవాలని, నీటిని వృథా చేయవద్దని అసిస్టెంట్ ఇంజనీర్ సత్య నారాయణ అన్నారు. సోమవారం పమిడి ముక్కల మండలం లోని వీరంకులకు బంగ్లా వద్ద ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. నీటిని మేడూరు కెనాల్కు, వీరంకులాకుకు పూర్తిస్థాయిలో వదిలేయమని, ఈ నీటితో చెరువులు నింపుకోవాలని ఆయన కోరారు. వేసవికాలం దృష్ట్యా కాలువల రిపేర్ చేయవలసి ఉందని, త్వరలోనే పనులు మొదలు పెడతామన్నారు. పంటల కాలానికి పూర్తి స్థాయిలో నీటిని అందజేస్తామని, రైతులు అధైర్యపడవద్దన్నారు.

గడువులోగా అర్జీలకు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం ఒక ప్రత్యేక వేదిక అని, స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు ఆశించిన స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆర్జీదారుల సమస్యల పరిష్కార దిశగా స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్లు ఎస్ రామలక్ష్మి, ఖతీప్ కౌసరా బానోలు ఆర్జీదారుల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. స్పందనలో స్వీకరించిన ఆర్జీలపై జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఆర్జీలకు నిర్ధిశిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. ఆర్జీలు ఏ స్థాయిలోను తిరిగి నమోదు కాకుడదన్నారు. సమస్యల పరిష్కారానికి స్పందన ఎకైక మార్గమని ఆర్జీదారులు ఎంతో ఆశతో స్పందనలో ఆర్జీలను అందజేస్తుంటారన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యకు సరైన పరిష్కారం చూపగలిగిన్నపుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. సమస్యను పరిష్కరించాలనే ఆలోచన పట్టుదలను అచరణలో పెడితే పరిష్కార మార్గాలు వాటికి అవే లభిస్తాయన్నారు. గ్రామ వార్డు సచివాలయాలు, 1902 కాల్ సెంటర్, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్ ద్వారా అర్జీలు నమోదవుతుంటాయన్నారు. ఆఫ్ లైన్, అన్ లైన్‌లో నమోదవుతున్న అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ డిల్లీరావు అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో 87 అర్జీల నమోదు అయ్యాయని వీటిలో అత్యధికంగా రెవెన్యూ 28, పోలీస్ 15, యంఏయుడి 15, విభిన్న ప్రతిభావంతులు 5, పంచాయతీరాజ్ 4, పౌర సరఫరాలు 3, ఉపాధి కల్పన 3, విద్య 2, సోషల్ వెల్ఫేర్ 2, దేవాదాయ శాఖ 2, కాగా మిగిలినవి వివిధ శాఖలకు చెందినవి 8 ఉన్నాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కంచికచర్ల: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే గ్రామాభివద్ధి సాధ్యమౌతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు సిబ్బంది తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కంచికచర్ల మేజర్ పంచాయతీ లో 20 వార్డుల్లో వార్డుల వారీగా నెలకొన్న సమస్యలను సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో తాగునీటి సమస్య ఉందని, కొన్ని ప్రాంతాల్లో 12 రోజులకు ఒకసారి కూడా మంచినీరు సరఫరా కావటంలేదని సభ్యులు పేర్కొన్నారు. వార్డుల్లో కనీసం కరెంటు స్తంభం కూడా వేయించలేని దీనస్థితిలో ఉన్నామని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో నిధులున్నా కార్యదర్శి కనగాల రవికుమార్ చూద్దాం చేద్దాం అంటూ దాటవేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమావేశం వాడివేడి ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో విడిగా సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాభివద్ధి విషయంలో అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, ఎంపిపి మలక్ పాల్గొన్నారు.

ఎంపిటిసి వేతనంతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల గ్రామ పరిధిలో 6 వ సెగ్మెంట్ ఎంపిటిసి బర్రె ఉదయ్ కిరణ్ తనకు వచ్చిన గౌరవ వేతనం నిధులతో అభివద్ధి పనులు చేపటం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో రోడ్డు, డ్రైనేజీ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఇళ్ళల్లో వాడకం నీరు కూడా డ్రైనేజీ లో పారుదల కాక రోడ్లు పై నిల్వ చేరుతున్నాయి. దీనిని గమనించిన స్థానిక ఎంపిటిసి బర్రె. ఉదయ్ కిరణ్ ఇటీవల తనకు వచ్చిన గౌరవవేతనం మొత్తాన్ని వెచ్చించి సోమవారం అంబేద్కర్ కాలనీలో కాలువ పూడిక తీత పనులు ప్రారంభించారు.

ఎపి జెన్‌కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఏపీ జెన్ కో మేనేజింగ్ డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కెవిఎన్ చక్రధర్‌బాబును విజయవాడ విద్యుత్ సౌధలో ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎపి జెన్‌కో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. వేతన సవరణ ఒప్పంద గడువు ముగిసి ఏడాది గడిచినా కొత్త వేతన సవరణ జరగలేదని, ఇప్పటికి రెండు డిఎలు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగుల హాజరు సమయాలను మార్పు చేశారని, పాత పద్ధతినే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.మోహన్‌రావు, పి.ప్రసాద్, బి.కోటేశ్వరరావు , ఆర్.రవీంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు డాక్టర్ సందేశ్ , డాక్టర్ చెన్నకేశవ్ పౌష్టిహాకరం పంపిణ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందేష్, డాక్టర్ చెన్నకేశవ, సీనియర్ అసిస్టెంట్ షేక్ జానీ సైదావలి, లాబ్ టెక్నీషియన్ ఎం.దుర్గారావు, హెల్త్ అసిస్టెంట్స్ డి.సురేష్‌బాబు, జి.నాగేశ్వరరావు, వి.ప్రతాప్ పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: రామవరప్పాడు నుండి ఎయిర్‌పోర్ట్ వరకు సాగుతున్న సుందరీకరణ పనులను రాష్ట్ర మున్సిపల్, పట్టణ అభివద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీ లక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు.

ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాల కనుగుణంగా ఉండాలని శ్రీలక్ష్మీ ఆదేశించారు. రహదారి వెంట గ్రీనరీతో పాటు సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలనానరు. అనంతరం కష్ణలంక సమీపంలోని రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, ఎస్ఇ కె.రామమోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పార్కులో పనులు వేగవంతం చేయాలి : కమిషనర్

కృష్ణలంక జాతీయ రహదారి పక్కన జరుగుతున్న అంబేద్కర్ పార్కు పునరుద్ధరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం అధికారులతో కలిసి కృష్ణలంక జాతీయ రహదారి పక్కన గల అంబేద్కర్ పార్కు పునరుద్దరణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పార్కులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని అధికారుల వద్ద నుంచి అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి-తిరువూరు

ఇటీవల న్యాయ స్థానాల్లో వివిధ పోస్టులకు జరిగిన పోటీ పరీక్షలలో ప్రాసెస్ సర్వర్‌గా ఎంపికైన తిరువూరుకు చెందిన ఎస్.కష్ణ కవితను సోమవారం తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధి ఎం.రాం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

61 ఫిర్యాదులు

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బాధితుల నుండి వివిధ సమస్యలు, వినతులు, విజ్ఞప్తులకు సంబంధించి నేరుగా పోలీసు కమిషనర్ కాంతిరాణాటాటా స్వీకరించడంతో పాటు భాదితులతో మాట్లాడటం జరిగింది. నడవలేని వికలాంగులు, వద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వార సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 61 ఫిర్యాదులు రాగా సిపి వాటిని స్వయంగా స్వీకరించారు.

లక్ష మల్లెలతో అభిషేకం

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: వేద సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్‌లోని చినకంచిలో సోమవారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి లక్షమల్లెలతో పూలభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కంచి పీఠం వేదాలకు ప్రాధాన్యం ఇస్తూ వేద పాఠశాల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నున్నలో గల చినకంచి మహా క్షేత్రంగా అభివృద్ధి చెందానుందన్నారు. అనంతరం చినకంచి ట్రష్టి మొక్కపాటి శర్మతో పాటు వేద పండితులందరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యార్కారెడ్డి నాగిరెడ్డి, నున్న పంచాయతీ ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బి.ముత్తారెడ్డి, ధర్మకర్తలు యోగాచార్య పోలారెడ్డి నాగిరెడ్డి, రామడుగు రామారావు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అంగజాల హనుమాన్, తొర్లికొండ దుర్గాప్రసాద్, తుమ్మల సుధాకర్, కొండేటి రాంబాబు, కలకోటి నాగిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 20 అర్జీలను మేయర్, కమిషనర్ స్వీకరించారు. అర్జీలు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నగర పరిధిలోని ఆయా సర్కిల్ కార్యాలయాలలో జోనల్ కమిషనర్లు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్కిల్-2 కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంనకు సంబంధించి ఒక అర్జీ దాఖలైంది.

ఆహ్వానము
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల
(మెయిన్), వీరులపాడు
100 Years ANNIVERSARY
ఈ పాఠశాల స్థాపించి 2023 ఏప్రియల్ 11వ తేదీ నాటికి నూరేళ్ళు నిండినది. సరిగ్గా 100 సంవత్సరాల క్రితం ది. 11-04-1923న ఈ పాఠశాల ప్రారంభించబడింది.
ఈ సందర్భంగా జరిగే పాఠశాల స్థాపన శతవార్షికోత్సవానికి విచ్చేయుచున్న విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు వీరులపాడు ప్రజలకు హృదయపూర్వక ఆహ్వానం.
విందు : ఉదయం 11:00గంటలకు
ఇట్లు: ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది
పాఠశాల విద్యా కమిటీ, M.P.P.S (Main), వీరులపాడు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.